అభివృద్ధి పథంలో గండేపల్లి

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు..
- గ్రామంలో తీరిన సమస్యలు
- పెరిగిన మౌలిక వసతులు
- హర్షం వ్యక్తంచేస్తున్న గండేపల్లి వాసులు


గండేపల్లిలో తుదిదశలో ఉన్న గ్రామ సచివాలయం పనులు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వెల్‌నెస్ సెంటర్


జెడ్పీ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు


జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లు

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో కంచికచర్ల మండలంలోని గండేపల్లి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామం ఎంతో అభివృద్ధిపథంలో పయనిస్తోంది. నవరత్నాలు పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందగా, అభివృద్ధి పనులతో గండేపల్లివాసులకు మౌలిక వసతులు సమకూరాయి.

రూ.55లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు..

జనాభా ప్రాతిపదికన గండేపల్లిలోని అన్నివార్డుల్లో సిమెంటురోడ్లు, మురుగునీరు పారుదల కోసం డ్రైయినేజీ నిర్మాణాలు చేపట్టింది. రూ.44లక్షలతో సీసీ రోడ్లు , రూ.10లక్షలతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. నీటిఎద్దడి లేకుండా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి రక్షిత మంచినీటి పథకం ద్వారా నిత్యం తాగునీరు సరఫరా చేస్తుండటంతో గ్రామస్తులకు మంచినీటి ఇక్కట్లు తప్పాయి.

రూ.37లక్షలతో స్కూళ్ల అభివృద్ధి...

నాడు–నేడు పథకం కింద గండేపల్లిలోని ఎంపీపీ స్కూల్‌ను రూ.15లక్షలతో, జెడ్పీ ఉన్నత పాఠశాలను రూ.25లక్షలతో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు వసతులు కల్పించారు. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కూడా పెరిగింది.

రూ.86లక్షలతో సచివాలయం, ఆర్బీకే..

గ్రామస్వరాజ్యస్థాపనే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలోనే ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. గండేపల్లిలో రూ.40లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణపు పనులు తుదిదశలో ఉన్నాయి. రూ.24లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.22లక్షలతో గ్రామస్తులకు స్థానికంగానే వైద్యసేవలు అందించేందుకు వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు.

రూ.1.40కోట్లతో ఇళ్లస్థలాలు..

గండేపల్లిలోని రెండు జగనన్న లేఅవుట్లలో ప్రభుత్వం 224 మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసింది. ఇందుకోసం రూ.1.40కోట్లతో ఏడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసింది. జగనన్న కాలనీల్లోని 224మందితోపాటు సొంతంగా ఇళ్లస్థలాలు ఉన్న మరో ఏడుగురితో కలిపి మొత్తం 231మందికి జగనన్న ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణం చేపట్టిన పేదలకు ఇప్పటివరకు రూ.1.83కోట్లను అందజేసింది. వాతావరణంలో మార్పులు, తుపానుల కారణంగా దెబ్బతిన్న పొలాలకు నష్టపరిహారం కింద గ్రామంలోని రైతులకు ఇప్పటివరకు రూ.53లక్షలు మంజూరు చేసి రైతులను ఆదుకుంది.

రూ.1.94కోట్ల రుణాలు మాఫీ..

అక్కాచెల్లెమ్మలు ఎవ్వరిపై ఆధారపడకుండా స్వతహాగా ఆర్థికంగా ఎదగాలన్నదే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి కోట్లాది రూపాయల నిధులు రుణంగా మంజూరు చేస్తోంది. గ్రామంలోని 81గ్రూపులకు రుణమాఫీ కింద మూడు విడతలుగా రూ.1.94కోట్లను అందజేయడంపై డ్వాకా సంఘాల మహిళలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. చేయూత మార్టుల ఏర్పాటుకు ఆర్థికసాయం అందించింది.

సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా గండేపల్లిలోని 382మంది రైతులకు ఈ నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వం రూ.4,39 కోట్లు పంపిణీ చేసింది. అమ్మ ఒడి పథకం ద్వారా 1,478మంది విద్యార్థులకు రూ.2.5కోట్లు, జగనన్న చేదోడు ద్వారా 96మందికి రూ. 9.60లక్షలు, జగనన్న తోడు పథకం కింద 34మందికి 3.4లక్షలు, జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 222మంది విద్యార్థులకు రూ.22.20లక్షలను అందజేసింది. ఇలా అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాల ద్వారా గండేపల్లివాసులకు కోట్లాది రూపాయలను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది.

సొంతింటి కల నెరవేరింది..



నా భర్త, నేను కూలి పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ఇటివలి కాలం వరకు అద్దె ఇంటిలో ఉన్నాం. సీఎం జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటిస్థలం ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి కూడా డబ్బులు ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నాం. మా సొంతింటి కల జగనన్నతోనే నెరవేరింది.

–నవరం లక్ష్మి

సీఎం జగన్‌ను జీవితాంతం మరిచిపోం...



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటిస్థలం కోసం అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో గ్రామ సచివాలయానికి వెళ్లి ఇంటిస్థలం కోసం అర్జీ పెట్టుకోగా మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయడంతో కష్టపడి ఇల్లుకట్టుకున్నాం. ఇప్పుడు కొత్త ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. మా జీవితాంతం జగనన్నను మరిచిపోం.

–సంఘం త్రివేణి

జగనన్నకు రుణపడి ఉంటాం..



గత ప్రభుత్వం హయాంలో గండేపల్లి అభివృద్ధికి నోచుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌తోపాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. మంచినీటి సమస్య తీరింది. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న సీఎం జగనన్నకి రుణపడి ఉంటాం.

– బొక్కా రవికుమార్, సర్పంచి, గండేపల్లి

క్లుప్తంగా

కంది పంట పరిశీలన



కన్నెవీడు(వత్సవాయి) : కేఎల్ రావు కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో గురువారం కందిపంటపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో కందిసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులను వివరించారు. జాతీయ ఆహారభద్రత మిషన్ సౌజన్యంతో సామూహిక ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రాల్లో భాగంగా పప్పు ధాన్యాలలో అ.ధిక దిగుబడి నిచ్చే కంది రకాలైన ఎల్ఆర్‌జీ–52, ఎల్ఆర్‌జీ–133–33 రకాలను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు పి.ఎన్.శివప్రసాద్, ఎన్.రాజనర్సింహ, ఐ.వెంకటరెడ్డి తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాల నిర్వహణ



వత్సవాయి: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి ఎల్.నాగరాజు సూచించారు. వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషిచేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగిందని వివరించారు. విద్యార్థులకు సులభరీతిలో పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. అదేవిధంగా కంభంపాడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, మంగొల్లులో నిర్వహించిన సమావేశానికి తెలుగు బోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఇందిర, అశోక్, రఘు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నందిగామ: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని లింగాలపాడు సర్పంచి బొల్లినేని పద్మజ అన్నారు. మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు జెడ్పీ ఆధ్వర్యంలో రూపొందించిన స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మార్కపాడి గురుస్వామి, ఎంపీటీసీ సభ్యుడు గరిమిడి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



కంభంపాడు(వత్సవాయి) : స్థానిక ప్రాథమిక సహకార పరపతి సంఘంలో సభ్యుడిగా ఉంటూ ఇటీవల మృతిచెందిన గూడూరు ప్రతాప్‌రెడ్డి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తొలివిడతగా మంజూరైన రూ.10వేలను సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. బీమా కింద రూ.1లక్ష మంజూరుకాగా, తొలివిడతగా మట్టిఖర్చుల కింద రూ.10వేలు అందజేశామన్నారు. మిగిలిన నగదును త్వరలోనే అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రామకృష్ణ, శీలం వెంకటప్పారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



పెద్దాపురం(వీరులపాడు): నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యమందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి గురువారం కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి వైద్యపరీక్షలు చేయడంతోపాటు కళ్లజోళ్లను అందించినట్లు చెప్పారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విశేష పూజలు

నందిగామ: పట్టణంలోని ముక్కోటి మండపంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి విశేష పూజలు చేశారు. మండపంలో రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈవీఎంలపై అవగాహన



మోగులూరు(కంచికచర్ల) : మండలంలోని మోగులూరు గ్రామస్తులకు ఈవీఎంల పనితీరు, ఈవీఎంల ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ పబ్బూరి శంకరబాబు మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా ఎన్నికలను సమర్థంగా నిర్వహించవచ్చని వివరించారు. ఓట్లను తారుమారు చేయడానికి ఎటువంటి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, వీఆర్వోలు ఎస్‌వీ రామారావు, శ్రీలక్ష్మి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

250 మందికి వైద్యపరీక్షలు



కంచికచర్ల : మండలంలోని పరిటాల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఆంధ్రా, హెచ్‌సీజీ క్యాన్సర్, దుహిత డెంటల్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొని కంచికచర్ల, గనిఆత్కూరు, పరిటాల, కొత్తపేట గ్రామాల ప్రజలు, కళాశాల సిబ్బందికి కలిపి 250మందికి వైద్యపరీక్షలు చేశారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహనరావు మాట్లాడుతూ శిబిరానికి హాజరైన వారికి వైద్యులు గుండె, కిడ్నీ, ఎముకలు, దంత, క్యాన్సర్ సంబంధిత వైద్యపరీక్షలు చేసినట్లు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్‌ఎం శశిధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జి టి కోటేశ్వరరావు, హెచ్‌వోడీ దొడ్డా పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


కొత్తపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు

కొత్తపేట(కంచికచర్ల) : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఆయా పథకాలు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, 31లక్షల మందికి ఇళ్లపట్టాలు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మఒడి, విద్యా దీవెన, అగ్రవర్ణాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్రం దేశచరిత్రలో మరొకటి లేదని గుర్తుచేశారు. పింఛనుదారులకు జనవరి ఒకటోతేదీ నుంచి రూ.3వేల పింఛను అందించనుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు. ఇలా పేదలందరికీ అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచి ప్రత్తిపాటి సునీత, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాథరావు, ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు పత్తిపాటి కృష్ణమూర్తి, ముప్పాళ్ల అప్పారావు, చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యనారాయణ, మందా రామారావు, పల్లెపోగు భాస్కరరావు, ముప్పాళ్ల అప్పారావు, వెల్లంకి భానుప్రసాద్, మార్త శ్రీనివాసరావు, వేల్పుల రమేష్, కార్యదర్శి సునీత, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


గండ్రాయిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


జయంతి గ్రామంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి


మక్కపేటలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు


కొణకంచిలో హోరాహోరీగా తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

జగ్గయ్యపేట: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. మండలంలోని గండ్రాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీలను సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరి ప్రారంభించారు. కనపర్తి ప్రసాద్, కార్యదర్శి జగ్గయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గౌరవరంలో నిర్వహించిన వాలీబాల్, షటిల్ పోటీలను సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలసైదా ప్రారంభించారు. తిరుమలగిరిలో ఖోఖో పోటీలను కార్యదర్శి నరసింహారావు ప్రారంభించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: జయంతి గ్రామ జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎంపీపీ కోటేరు లక్ష్మి గురువారం ప్రాంభించారు. ఎంఈవో కెనడి, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, నాయకులు ఇప్పల కృష్ణారెడ్డి, మారపాక శ్రీనివాసరావు, సాంబిరెడ్డి, పాల్గొన్నారు. జుజ్జూరు, అల్లూరు, జమ్మవరంలలో జరుగుతున్న పోటీలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : మండలంలో లింగాల, మక్కపేట, పోలంపల్లి, వత్సవాయి, కన్నెవీడు, భీమవరం, మంగొల్లు గ్రామాలో గురువారం షటిల్, క్రికెట్, కబాడీ పోటీలను నిర్వహించారు. పోటీలను ఆయా గ్రామాల సర్పంచులు గుడేటి శారమ్మ, మాదుగుల లాజర్, భూక్యా సీతమ్మ, చావా దుర్గారాణి, అన్నెపాక ప్రణీత ప్రారంభించారు. కార్యదర్శులు షేక్ ఇమామ్‌సాహెబ్, వై పద్మ,కె. సంక్రాంత్, చాందుసాహెబ్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్, కొణకంచి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పెనుగంచిప్రోలులో జరిగిన క్రీడలను సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ పరిశీలించారు. పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, హెచ్ఎం కె జలజ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం

గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కలలో కొలువై ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణం గురువారం కన్నుల పండువగా సాగింది. ముందుగా స్వామివారికి మహన్యాసపూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. స్వామివారికి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో వేదాంతం హరిప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామానికి చెందిన యరమాస శివరామ ప్రసాద్, శ్రీనివాసరావు, సూరపనేని జీవన, పెనుముచ్చు రాము బహుకరించారని అర్చకులు ముత్తేవి కేశవాచార్యులు తెలిపారు.

పంట దిగుబడులపై అంచనా



నందిగామ: మండలంలోని పల్లగిరిలో సాగువుతున్న వరిపంటను బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం పరిశీలించారు. కళాశాలకు చెందిన నిహాలుద్దీన్, అనిల్, అక్రూమ్, హర్షవర్ధన్‌రెడ్డి ఆయా వరిపొలాలను పరిశీలించి పంట దిగుబడిని అంచనా వేశారు. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంచనా ఉందని వారు వివరించారు. వారి వెంట వీఏఏ శివరామకృష్ణ ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నందిగామ: మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన కర్ల రంగారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, గ్రామానికి చెందిన కంపాషన్ కమ్యూనిటీ ఆఫ్ సర్వీసెస్ సంస్థ మృతుని కుటుంబానికి రూ.4వేలను ఆర్థికసాయంగా గురువారం అందజేసింది. సంస్థ ప్రతినిధులు ఉలవల్లపూడి నరేంద్ర, యాకోబు, ఆజాద్, పూర్ణయ్య, బాలయ్య పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం


ట్యాబ్‌ల పంపిణీ అనంతరం విద్యార్థులతో ఎంపీపీ గాంధీ, సర్పంచ్ పద్మకుమారి, టీచర్లు

పెనుగంచిప్రోలు: విద్యాభివృద్ధితోనే సామాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. గ్రామసర్పంచి వేల్పుల పద్మకుమారితో కలసి గురువారం ఆయన స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచివిద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి డిజిటల్ విప్లవానికి నాంది పలికారని, నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని వివరించారు. పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు జంగం వీరమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, హెచ్ఎం కె.జలజ, మండల పరిషత్ కార్యాలయ ఏవో సిద్ధారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భయపెడుతున్న విద్యుత్ స్తంభం


పక్కకు ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

నందిగామ: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఓ విద్యుత్ స్తంభం కొన్నాళ్లుగా ఒరిగిపోయి దర్శనమిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈరోడ్డులో నిత్యం అనేక ప్రాంతాల నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలా ఒరిగిన విద్యుత్ స్తంభం చూసి ఈరోడ్డులో రాకపోకలు సాగించేవారు ఆందోళన చెందుతున్నారు. గతంలో కొన్ని విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో ఎత్తయిన స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రోడ్డు పక్కనే ఉన్న పలు స్తంభాలను తొలగించగా, కొన్ని స్తంభాలను తొలగించలేదు. తొలగించని స్తంభాల్లో ఒకటి ఇలా ఒరిగి దర్శనమిస్తుండటంతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై విద్యుత్ శాఖ ఏఈ దిబ్బయ్యను వివరణ కోరగా మెయిన్‌బజారులో మరమ్మతులు చేయాల్సి ఉందని, ఆసమయంలో ఒరిగిన స్తంభాలను కూడా సరిచేస్తామని వివరించారు.


ఆలయానికి రూ.40.83 లక్షల ఆదాయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయా హక్కుల వేలం ద్వారా రూ.40.83లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. ఆయా హక్కులకు ఆలయ ప్రాంగణంలో గురువారం వేలం నిర్వహించారు. భక్తుల తలనీలాలు పోగు చేసుకునే హక్కును హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసా ఉమెన్ హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ రూ.24.10 లక్షలకు కైవసం చేసుకోగా పాలు, బియ్యం, నెయ్యి పోగు చేసుకునే హక్కును రూ.13.03లక్షలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కును రూ.3.10లక్షలు, ఫొటోలు తీసుకునే హక్కును రూ.60,500లకు పాడుకున్నట్లు ఈవో వివరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిదుర్గా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు...

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం(పెద్ద శివాలయం) హుండీని గురువారం లెక్కించారు. హుండీ ద్వారా రూ 99,962 ఆదాయం వచ్చినట్లు ఈవో జయప్రకాష్ బాబు తెలిపారు. చందర్లపాడు గ్రూపు దేవస్థానాల ఈవో ఎం.తేజ, ఆలయ మాజీ చైర్మన్ గెల్లా పూర్ణచంద్రరావు, ప్రధానార్చకులు పి.కేశవప్రసాద్, ఆలయ స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, ఎస్.శ్రీరంగమ్మ, కోట హరిప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా అర్బన్ మార్కెట్ ఏర్పాటు


అర్బన్ మార్కెట్ వద్ద కొనుగోలుదారుల సందడి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో మహిళా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన డ్వాక్రా గ్రూపుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆయా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి ఈ మార్కెట్ ఉపయోగపడుతుందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ ఆర్. రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు ప్రభాకర్, షేక్ హాఫీజున్నీసా ఫిరోజ్, పలువురు కౌన్సిలర్లు మార్కెట్‌ను సందర్శించారు. మెప్మా సీవోలు నిర్మల, దుర్గ, వెంకట్ మాట్లాడుతూ 30స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రెస్ మెటీరియల్స్, చీరలు, పచ్చళ్లు, పండ్లు, స్నాక్స్ తదితర ఫుడ్ ఐటమ్స్ కౌంటర్లు ఏర్పాటుచేశామన్నారు. ఈ మార్కెట్ శుక్రవారం కూడా ఉంటుందని, నెలలో రెండురోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెప్మా సీఎంఎం శ్రీధర్, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తాడపనేని రాజేష్ S/o. శివబాబు, 22/108, కాకానినగర్, నందిగామ. N.T.R. జిల్లాకు చెందిన నా యొక్క పాస్‌పోర్ట్ నందిగామ జిరాక్స్ సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని ఇంటికి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. సదరు పాస్‌పోర్టు నెం. V3159599. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
సెల్: 8555882340